నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, డిసెంబర్ 21 : భారత ఆహార సంస్థకు కేటాయించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లర్లతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 29 రైస్ మిల్లుల యజమానులు పోటీతత్వం అలవర్చుకొని లక్ష్యాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు. మిల్లుల వారీగా సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ అభిషేక్ సింగ్, సహాయ పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళలు

గుర్తింపు కార్డును వెంట పెట్టుకోవాలి

డిపో మేనేజర్ సరితాదేవి

బాన్సువాడ, డిసెంబర్ 21 : మహాలక్ష్మి పథకంలో ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే మహిళలు కచ్చితంగా గుర్తింపు కార్డును వెంట పెట్టుకోవాలని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితా దేవి సూచించారు. ఆధార్ కార్డు, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఏదేని ఫొటోతో కూడిన ఐడెంటింటీ కార్డు వెంట ఉండాలన్నారు. అప్పుడే బస్సులో ఉచిత ప్రయాణానికి అర్హులని, లేనియెడల టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. బాన్సువాడ డిపో నుంచి 69 బస్సులు, మరో 17 ప్రైవేట్ బస్సు లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రతినిత్యం 30 వేల మంది ప్రజలు బస్సుల్లో ప్రయాణం చేసేవారని, ప్రస్తుతం మహాలక్ష్మి పథకం వచ్చాక 50 వేల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు. బాన్సువాడలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం ఉచితమని, కానీ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులో ప్రయాణిస్తే టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

వైద్యుడిని నియమించాలని గ్రామసభ తీర్మానం

బీబీపేట గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రమేశ్

బీబీపేట్, డిసెంబర్ 21 : బీబీపేటలోని ప్రభుత్వ దవాఖానలో పర్మినెంట్ డాక్టర్‌ను తీసుకురావాలని సభ్యులు తీర్మానించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ లక్ష్మీసత్యనారాయణ, ఉపసర్పంచ్ సాయినాథ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధి హామీపై గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టే ఉపాధిహామీతోపాటు అభివృద్ధి పనులు, పలు అంశాలను సభలో చర్చించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నుంచి ఈకేవైసీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రమేశ్, కారోబార్ సిద్ధరాములు, పలు శాఖల అధికారులు, పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొదలు తొలగించండి సారూ..

కొత్తాబాది మాడల్ స్కూల్ భవనం చుట్టూ ఏపుగా పెరిగిన పొదలు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 21 : మండలంలోని మాడల్ స్కూల్ భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయి. పాఠశాల భవనం వెనుక భాగం, పక్కన పొదలు ఏపుగా పెరిగి పాములకు స్థావరంగా ఉండే అవకాశం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చొరవ తీసుకొని భవనం చుట్టూ ఉన్న పొదలను తొలగించాలని కోరుతున్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకొవాలని వారు కోరుతున్నారు.

బీబీపేట్ ఎస్సైగా అనిల్

బీబీపేట్, డిసెంబర్ 21: బీబీపేట్ ఎస్సైగా అనిల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి టౌన్ పీఎస్‌లో ఎస్సైగా పనిచేసి బీబీపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. బీబీపేటలో పని చేసిన ఎస్సై సాయిరెడ్డి నిజామాబాద్ రైల్వే పీఎస్‌కి బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీబీపేట ఎస్సై అనిల్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో ప్రజలు సహకరించాలనికోరారు. వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు వెంట పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మండల ప్రజలు పోలీస్‌లకు సహకరించాలన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

వధువుకు పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

బీబీపేట్, డిసెంబర్ 21 : మండల కేంద్రానికి చెందిన మ్యాదరి భాగ్యలక్ష్మి వివాహానికి జనగామ గ్రామానికి చెందిన ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు వధువుకు పుస్తె, మెట్టెలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాత స్వామి, శేఖర్, ఆకుల రాములు, పాత శేఖర్, బెల్లె వంశీ, స్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో దంత వైద్య శిబిరం

విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 21 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. తమ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కామారెడ్డి వాసవి డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ రాకేశ్, డాక్టర్ నవ్య దంతాల రక్షణకు పలు సూచనలు చేశారు. 200 మంది విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రెటరీ రాజనర్సింహారెడ్డి, శ్రీశైలం, గంగారెడ్డి, కాశీనాథం, కృష్ణమూర్తి, వై.వి.చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటానికి ఎల్లప్పుడూ సిద్ధం

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 21 : విద్యార్థుల సమస్యల పై పోరాడేందుకు అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణా తెలిపారు. బాన్సువాడ పట్టణంలో శిశుమందిర్‌లో గురువారం ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యా సమస్యలపై పోరాటం చేస్తూనే అనేక సామాజిక కార్యక్రమాల్లో ఏబీవీపీ తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్నదని తెలిపారు. పట్టణ కన్వీనర్‌గా హనుతేజ, సంయుక్త కార్యదర్శిగా భానుప్రకాశ్, వివేకానంద, జోనల్ ఇన్‌చార్జి జస్వంత్, అంబేద్కర్, ఆనంద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై

బీజేపీ నాయకుల నిరసన

కామారెడ్డిలో నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి/బీబీపేట్/మాచారెడ్డి/దోమకొండ/భిక్కనూరు/బాన్సువాడ, డిసెంబర్ 21 : జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతి జగత్ ధన్కర్‌ను అనుకరిస్తూ టీఎంసీ ఎంపీ కల్యాన్ బెనర్జీ అవహేళన చేయడం.. దానిని రాహుల్‌గాంధీ వీడియో తీయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని అన్నారు. కామారెడ్డితోపాటు బీబీపేట్, మాచారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, బాన్సువాడలో బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 21 : మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. సాయినాథుడికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే భక్తులు చేరుకోవడంతో సాయి ఆలయం కిటకిటలాడింది.

పంటల సాగుపై అవగాహన అవసరం

పంటలను పరిశీలించి సూచనలు అందజేసిన వ్యవసాయాధికారులు

మార్దాండలో మక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఈవో

మాట్లాడుతున్న రియలన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ రాజు

సదాశివనగర్, డిసెంబర్ 21: రైతులు తాము పండించే పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా అధికారి రాజు అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ.. అధిక దిగుబడులను సాధించాలన్నారు. విండో చైర్మన్ మర్రి సదాశివారెడ్డి, ఎంపీటీసీ సంకరి లక్ష్మీ రాజలింగం, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల విఠల్, ఏఎంసీ డైరెక్టర్లు, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన..

మద్నూర్, డిసెంబర్ 21: మండలంలోని పెద్దశక్కర్గ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న శనగ పంటను మండల వ్యవసాయాధికారి రాజు గురువారం పరిశీలించారు. పంటకు ఎండుతెగులు, పచ్చపురుగు ఆశించినట్లు గుర్తించారు. వీటి నివారణ కోసం పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు వివరించారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

నాగ్లూర్ శివారులో మక్కజొన్న పంట..

గాంధారి, డిసెంబర్ 21: మండలంలోని నాగ్లూర్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న మక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి నరేశ్ గురువారం పరిశీలించారు. పంటపై మొగిపురుగు ఆశించినట్లు గుర్తించారు. దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతులు యాసంగిలో సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో ఆర్తి ఉన్నారు.

నివారణ చర్యల వివరణ..

పిట్లం, డిసెంబర్ 21: మండలంలోని మార్దండ గ్రామంలో రైతులు సాగుచేస్తున్న జొన్న, మక్కజొన్న పంటలను ఏఈవో ప్రదీప్ గురువారం పరిశీలించారు. పంటలపై కత్తెర, మొగి పురుగు ఆశించినట్లు గుర్తించి నివారణ చర్యలను వివరించారు. రైతు రామకృష్ణ ఉన్నారు.

నారుమడిలో సస్యరక్షణ చర్యలు అవసరం..

డోంగ్లీ, డిసెంబర్ 21: మండలంలోని కుర్ల గ్రామంలో రైతులు వేసిన నారు మడులను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. చలికి నారు ఎదుగుదల తక్కువగా ఉంటుందని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారు మడిలోని నీటిని సాయంత్రం వేళ తొలగించాలని, సాయంత్రం టార్పాలిన్ లేదా గడ్డిని నారుమడిపై కప్పి ఉదయం తొలగించాలని సూచించారు. జింక్ లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే, నివారణ కోసం రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి ఒక కిలో యూరియాను కార్బండిజమ్, మంకోజేబ్ మిశ్రమంతో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి రాజు, ఏఈవో సమ్రిన్ రైతులకు సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 21: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అందజేశామని ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి శంకర్ తన సెల్‌ఫోన్ పోవడంతో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ మాక్లూర్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని బాధితుడికి గురువారం అందజేశారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

పిట్లం, డిసెంబర్ 21: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఏఎస్సై లింబాద్రి అన్నారు. పిట్లంలోని జాతీయ రహదారిపై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది మారుతి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో అన్నదానం

పిట్లం/ సదాశివనగర్, డిసెంబర్ 21: పిట్లం, సదాశివనగర్‌లోని అయ్యప్ప ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిట్లంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నారం వెంకట్ రాంరెడ్డి, సదాశివనగర్‌లో కొప్పుల సునందా గంగారెడ్డి దంపతులు దాతలుగా నిలిచారు. వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. భక్తులు, మాలధారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పాల క్యాన్ల పంపిణీ

క్యాన్లను అందజేస్తున్న విజయ డెయిరీ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ తదితరులు

సదాశివనగర్, డిసెంబర్ 21: పద్మాజీవాడి గ్రామంలో పాడి రైతులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో గురువారం డెయిరీ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, పద్మాజివాడి డెయిరీ చైర్మన్ ఎర్రవాటి గంగారెడ్డి కలిసి పాల క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. సబ్సిడీపై దాణ, గడ్డి విత్తనాలు అందజేస్తున్నదని, విజయ డెయిరీలో పాలు పోసిన రైతులకు 15 రోజులకు ఒకసారి డబ్బులను చెల్లిస్తున్నట్లు తెలిపారు. కేంద్రానికి పాలు తీసుకు రావడానికి వీలుగా క్యాన్లను పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి బీఎంసీ మేనేజర్ యాడారం రమేశ్, సర్పంచ్ మడిపెద్ది కవితా ఆనంద్, ఎంపీటీసీ సూజాతా బాపురెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రవాటి లింగారెడ్డి, డైరెక్టర్లు, కార్యదర్శి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జడ్పీటీసీ

రామారెడ్డి, డిసెంబర్ 21: మండలంలోని ఇసన్నపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికి పాఠశాలను జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని హెచ్ఎం బాల్‌కిషన్‌కు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I DESAI REDDY JAIDI S/o. JAIDI LINGANNA, H.No.6-127/7, Thorlikonda, Jakranpally, (D) Nzb. Changed my Surname/ Name as JAIDI RAJANNA

WANTED

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830. NT-314474

CHANGE OF NAME

★I, SHAIK HANIF, R/o. 7-15, Bellal Gramam, Bodhan, Amdapur, Shakkar Nagar, Nizamabad Dt., TS. Changed My Name as SHAIK HANEEF, S/o. Shaik Habeeb. NT-324480

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జాతీయ రహదారి విస్తరణ కోసం సర్వే

సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

నిజాంసాగర్, డిసెంబర్ 21: హైదరాబాద్–మెదక్–బోధన్ రోడ్డు విస్తరణ పనుల కోసం మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో గురువారం సర్వే చేపట్టారు. హైదరాబాద్–మెదక్–బోధన్ రోడ్డును 765డీ జాతీయ రహదారిగా మార్చి మెదక్ నుంచి నిజామాబాద్ జిల్లా రుద్రూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఇందు కోసం రూ.900 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూర్ వరకు ఒక ప్యాకేజీగా 51.66 కిలోమీటర్ల మేర విస్తరణ కోసం రూ.500 కోట్లు, ఎల్లారెడ్డి నుంచి నాగిరెడ్డిపేట మీదుగా మెదక్ వరకు మరో ప్యాకేజీగా 43.91 కిలో మీటర్లు రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నారు. మెదక్ నుంచి రుద్రూర్ వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బాలాజీ తండాలో నీటి ఎద్దడి

పొలంలో మోటరు వద్ద నీరు పట్టుకుంటున్న తండావాసులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 21: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో ఉన్న బాలాజీ తండాలో వారం రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడింది. తండాలో 60 కుటుంబాలు ఉండగా.. ఒకే చేతిపంపు ఉన్నది. అది కూడా పనిచేయక పోవడంతో పాటు పాఠశాల ఆవరణలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్ కూడా చెడిపోయింది. దీంతో వారికి మిషన్ భగీరథ నీళ్లే దిక్కయ్యాయి. తద్వారా పూర్తి స్థాయిలో నీటి అవసరాలు తీరడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పాఠశాల ఆవరణలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్‌కు మరమ్మతులు చేయించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బడి బయటి దివ్యాంగ చిన్నారుల సర్వే

గాంధారి, డిసెంబర్ 21: బడిబయటి దివ్యాంగ చిన్నారుల కోసం గాంధారిలో గురువారం విద్యాశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. భవిత కేంద్రం రిసోర్సు టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. గ్రామంలో ఎవరైనా దివ్యాంగ చిన్నారులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమ్మాయి సంజీవ్, రిసోర్సు టీచర్లు పెంటయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఈజీఎస్ సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 21: బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసి.. మేమున్నామని భరోసా కల్పించారు ఫీల్డ్ అసిస్టెంట్లు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సోమార్‌పేట్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సాయి ప్రసాద్ ఈనెల 17వ తేదీన మరణించాడు. ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి తమ వంతు సాయంగా రూ.50వేలు బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీవో ప్రకాశ్ మాట్లాడుతూ.. బాధిత ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డి, డిసెంబర్ 21: ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేట్ జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ముఖీద్, సురేశ్ బదిలీ అయ్యారు. దీంతో పాఠశాలలో హెచ్ఎం రాజులు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్స వెంకటరమణ, దేవేందర్, సుభాష్, సాయిలు, అతీఖుల్లా, ప్రకాశ్, విజయశ్రీ, మేఘమాల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలని తీర్మానం

నిజాంసాగర్, డిసెంబర్ 21: జుక్కల్ మండలంలోని సావర్‌గావ్‌లో గురువారం గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ కిషన్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో 2024–25 సంవత్సరంలో గ్రామంలో చేపట్టబోయే ఉపాధి హామీ పథకం పనులను గుర్తించాలని తీర్మానించారు. గ్రామస్తులకు ఉపయోగపడే పనులను గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సోపాన్, కూలీలు పాల్గొన్నారు.